రోడ్డు విస్తరణకు మోక్షమెప్పుడో..?

- నాలుగేళ్ల క్రితం 40 ఫీట్ల రోడ్డుకు తీర్మానం
- ఏళ్లు గడుస్తున్నా కదలని అభివృద్ధి పనులు
- పంచాయతీ నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఫిర్యాదు


గ్రామపంచాయతీ వద్ద ఇరుకుగా ఉన్న రోడ్డు


ఆంధ్రాబ్యాంక్ వద్ద వాహనాలు వెళ్లలేని పరిస్థితి

కోనరావుపేట: మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ లేక ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో 40 ఫీట్ల రోడ్డు విస్తరణ చేయాలని 2019లో తీర్మానించారు. తీర్మానం అమలు కాకపోగా ఒక్కోచోట రోడ్డు ఒక్కో విధంగా ఉండడంతో పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేస్తున్నారు.

అమలు కాని రోడ్డు విస్తరణ కార్యక్రమం

కోనరావుపేట బస్టాండ్ నుంచి గోదాము వరకు రోడ్డును 50 ఫీట్ల రోడ్డుగా మార్చాలని పంచాయతీ పాలకులు తీర్మానించారు. బస్టాండ్ నుంచి పశువుల ఆస్పత్రి వరకు 40 ఫీట్లు, అంకంపేట చౌరస్తా నుంచి నిమ్మపల్లి రోడ్డును 30 ఫీట్ల రోడ్డుకు గతంలోనే తీర్మానించారు. బస్టాండ్ నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు వయా పాత బ్యాంక్ రోడ్డును 40 ఫీట్ల రోడ్డుగా మారిస్తే నిమ్మపల్లికి వెళ్లే బస్సులు, ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది .

సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ అంతే

కోనరావుపేట బస్టాండ్ నుంచి గ్రామం మీదుగా నిమ్మపల్లి, ఎగ్లాస్‌పూర్ గ్రామాలకు రహదారి ఉంది. ఎగ్లాస్‌పూర్ గ్రామానికి వెళ్లే బస్సు ఇదే రోడ్డులో వెళ్తుంది. ఈ రోడ్లతో పాటు పాత ఆంధ్రాబ్యాంక్ రోడ్డు నుంచి నిమ్మపల్లి రోడ్డుకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించినా ఇప్పటి వరకు ఎలాంటి పనులు మొదలుకాలేదు. దీంతో మండల ప్రజలకు సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ కలగానే మారుతోంది. మండల కేంద్రంలో ఒక్కో చోట ఒక్కో విధంగా రోడ్డు వెడల్పు చేస్తున్నారని, దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు 2022 నవంబర్ 7న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదుతో విచారణకు వచ్చిన అధికారులు నామమాత్రంగా విచారణ జరిపారని, సమస్య పరిష్కారం కాలేదని 2023 జనవరి 16న డీఎల్పీవో, ఎంపీవోలపై కూడా ఫిర్యాదు చేశారు. విస్తరణ పనులకు సంబంధించి ఉన్నతాధికారులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి



కోనరావుపేటలో 40 ఫీట్ల రహదారికి పంచాయతీ తీర్మానించింది. అయితే ఒక్కో చోట ఒక్కో విధంగా రోడ్డు తయారైంది. దీంతో గ్రామంలో సమస్యలు ఏర్పడుతున్నాయి. రోడ్డు వెడల్పు చేయడంలో పంచాయతీ పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి పంచాయతీ ఆధ్వర్యంలో తీర్మానించిన నిర్ణయాలను అమలు చేసి ప్రజల సమస్యలు పరిష్కరించాలి.

– గొట్టె శంకర్, కోనరావుపేట

వచ్చే నెలలో చేపడుతాం



బస్టాండ్ నుంచి ఉన్న మూడు రహదారుల వెడల్పు కోసం గతంలోనే తీర్మానించాం. నూతన నిర్మాణాలను 40 ఫీట్ల రోడ్డు వదిలిన తర్వాతనే చేపడుతున్నాం. త్వరలోనే గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి, కోనరావుపేట బస్టాండ్ నుంచి గతంలో తీర్మానించిన విధంగా 40 ఫీట్ల రహదారుల వెడల్పు చేసే కార్యక్రమాన్ని వచ్చే నెలలోనే ప్రారంభించి పనులు పూర్తి చేస్తాం.

– పోకల రేఖ, సర్పంచ్ కోనరావుపేట

క్లుప్తంగా

పోస్టల్ పథకాలను వినియోగించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న పోస్టల్ అధికారులు

కోనరావుపేట: పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని జిల్లా పోస్టల్ అధికారి దయానంద్ కోరారు. పోస్టల్ అమలు చేస్తున్న పథకాలపై జనవరి 1 నుంచి గ్రామాల్లో మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇటీవల సవరించిన వడ్డీ రేట్లతో పోస్టల్ పథకాలు ఎంతో ఆకర్షణీయంగా మారాయన్నారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకాలు అందరికీ వర్తించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల ప్రజలు ఈ పథకాలలో చేరి ప్రయోజనాలను పొందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయకులు భారత, రాఘవరెడ్డి, బీపీఎం పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్లటౌన్: అనాథ పిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని మహజన సోషలిస్టు పార్టీ జిల్లా ఇన్‌చార్జి అవునూరి ప్రభాకర్, స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో తల్లిదండ్రులు లేని చిన్నారుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అనాథ పిల్లలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, వారికి ప్రత్యేకంగా జిల్లాకు గురుకుల పాఠశాలను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం లేకుండా స్మార్ట్ కార్డులు అందజేసి, కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్యా అందజేస్తామని మంత్రి కేటీఆర్ మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సును ప్రకటించారన్నారు. ఏళ్లు గడుస్తున్నా అనాథ పిల్లల సమస్యలు పరిష్కరించడం లేదని, ప్రభుత్వం స్పందించాలన్నారు. నాయకులు లక్ష్మణ్, గుండా థామస్, చంద్రమౌళి. భేష్‌కుమార్, రామచంద్రం, మల్లేశం, రాంచంద్రం పాల్గొన్నారు.

వాహన నిబంధనలు పాటించాలి


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నవత

వీర్నపల్లి: వాహనదారులు వారి వాహనాలకు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని లేనిపక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని ఎస్‌ఐ నవత అన్నారు. మండల కేంద్రంలోని పలు చోట్ల వాహనాలను శుక్రవారం తనిఖీ చేసి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులను జరిమానాలు విధించారు. హెల్మెట్ ధరించడం, వాహనాలకు ఇన్సూరెన్స్ కలిగి ఉండడం వాహనదారుల భద్రత కోసమని అన్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ అంతరాయం

వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని హన్మక్కపల్లి, కొనాయపల్లిలో నేడు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని సెస్ అధికారులు తెలిపారు.

సమాచారం

క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా కేంద్రాల్లో ప్రవేశాల కోసం వివిధ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా శాఖాధికారి కె.ఉపేంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. అర్చరీ, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, హాకీ తదితర క్రీడాంశాల్లో జిల్లాలోని బాలబాలికలకు ఎంపిక పోటీలను హైదరాబాద్ జీఎంసీ బాలయోగి స్టేడియంలో, కబడ్డీ ఎల్‌బీనగర్‌లోని సరూర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ఉత్సాహవంతులైన 12 నుంచి 18 ఏళ్ల లోపు బాలబాలికలు ఈ నెల 31, ఫిబ్రవరి 1 జరిగే ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చునని సూచించారు.

నియామకం

రెడ్డి సంఘం కార్యవర్గం

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపల్లి రెడ్డి సంఘం అధ్యక్షుడిగా అచ్చయ్యగారి సుకుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడు తూర్పు వీరారెడ్డి, డైరెక్టర్లుగా నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, ఆనందరెడ్డి, గోపాల్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, రామ్‌రెడ్డి, రాజిరెడ్డి, ఎల్లారెడ్డి, రామ్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుల ఎన్నిక

ఎల్లారెడ్డిపేట: మండలంలోని హరిదాస్‌నగర్, పదిర కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులుగా చెరుకు ఎల్లయ్య, గురువు పర్శరాములును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మల్లారెడ్డి, రామచంద్రం, ఇమామ్, బాబు, రవి, లక్ష్మారెడ్డి, షేక్ గౌస్ పాల్గొన్నారు.

కురుమ సంఘం గ్రామ శాఖ

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామ శ్రీ కృష్ణ కురుమ యాదవ సంఘం కార్యవర్గ ఎన్నికలుకురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏనుగుల కనుకయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా మిరుపాల కొమురయ్య, ఉపాధ్యక్షుడిగా గొల్ల ఐలయ్య, మ్యాకల నర్సయ్య, కోశాధికారిగా సంబ సురేశ్ ఎన్నికయ్యారు.

మొగిపురుగు నివారణకు చర్యలు చేపట్టండి

- కరీంనగర్ ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ ఎం.రాజేంద్రప్రసాద్


మాట్లాడుతున్న ఏరువాక కోఆర్డినేటర్

ఇల్లంతకుంట: మండలంలోని వల్లంపట్ల, రంగంపేట గ్రామాల్లో వరి పంటకు ఆశిస్తున్న మొగిపురుగు తెగుళ్ల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరీంనగర్ ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ ఎం.రాజేంద్రప్రసాద్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారుమడిలో ఆశిస్తే మొక్కలు, పిలక దశలో ఆశిస్తే మొక్కలు చనిపోతాయని, అంకురం నుంచి చిరుపొట్ట దశలో ఆశిస్తే వరి పైరు ఈనిన తరువాత తెల్లకంకులు బయటకు వస్తాయన్నారు. వరినాట్లు వేసిన 10 రోజుల నుంచి 15 రోజుల్లో కార్బోఫ్యూరాన్ 3జీ గులికలు ఎకరాకు 10 కిలోల చొప్పున, కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరాకు 8కిలోలు, క్లోరాంత్రనిలిప్రోల్ 0.4జీ గుళికలు ఎకరాకు 4 కిలోలు చల్లుకోవాలన్నారు. మొగిపురుగు ఉధృతి ఎక్కువ ఉన్నప్పుడు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్.పి 400 గ్రాములు ఎకరాకు చల్లాలని, ప్రోఫెనఫోస్ 400 మిల్లీ లీటర్లు ఎకరాకు స్ప్రే చేయాలన్నారు. సల్ఫాయిడ్ నివారణకు కాంప్లెక్స్ ఎరువులను చల్లకుండా చూసుకోవాలన్నారు. నీరుని తీసివేసి సన్నటి పగుళ్లు వచ్చే వరకు ఆరబెట్టుకోవాలని సూచించారు. సర్పంచ్ అనసూయ, ఎంపీటీసీ స్రవంతి, ఏఈవోలు లతశ్రీ, అర్చన పాల్గొన్నారు.

రైతు వేదికలో..

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక, బోయినపల్లి, విలాసాగర్, కోరెం రైతువేదిక భవనాల్లో శుక్రవారం రైతులకు యాసంగి పంటల్లో చీడపీడల నివారణపై ఆయా క్లస్టర్ల ఏఈవోలు అవగాహన కల్పించారు. పొలంలో మురుగు నీరు తీసి కొత్త నీరు అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవోలు శ్రీదేవి, రజిత, రవళి, సాహితీ, రైతులు పాల్గొన్నారు.

పంట పొలాల పరిశీలన



వీర్నపల్లి: మండలంలోని మద్దిమల్ల గ్రామ పంచాయితీ పరిధిలోని పంట పొలాలను శుక్రవారం వ్యవసాయ విస్తరణాధికారి శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు వరి నాట్లు వేసిన 15 నుంచి 20 రోజుల మధ్యలో తప్పకుండా కార్టప్ హైడ్రాక్లోరైడ్ గులికలు ఎకరానికి 8 కేజీలు లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 ఘాముల గులికలు వేయాలని సూచించారు. ప్రధానంగా పొలంలో పిలకలు వేసే దశలో వరి పిలకలు చనిపోవడం(మొగిపురుగు), ఆకుముడత పురుగు గమనించినపుడు కార్టప్ హైడ్రాక్లోరైడ్ 50 శాతం ఎస్‌పీ 2 గ్రాములు లీటర్ నీటికి లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.4 మీలీ, లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మల్యాల అశోక్, బట్టు మొజ్య, దేవ్య, బంతిలాల్, కిషోర్ పాల్గొన్నారు.

చిత్రకథ



ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?

వేములవాడరూరల్: రోడ్ల పక్కన ధాన్యం పోయరాదని చెప్పినప్పటికీ ఇంకా రైతుల్లో అవగాహన రావడం లేదు. నేటికీ చాలా గ్రామాల్లో రోడ్ల మీదనే ధాన్యాన్ని ఆరబెట్టడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని జయవరం బ్రిడ్జిపై కొన్ని రోజులుగా రైతులు ధాన్యాన్ని ఆరబెట్టడంతో రాత్రి సమయంలో కొత్త వ్యక్తులకు ధాన్యం కుప్పలు కనబడక ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

ఆవునూర్‌లో ఎంపీవో విచారణ

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్ గ్రామపంచాయతీలో అవినీతి అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదు మేరకు వేములవాడ ఎంపీవో శ్రీధర్ శుక్రవారం విచారణ చేపట్టారు. గ్రామస్తులు ఏనుగు వేణు తదితరులు జిల్లా కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేసినట్లు ఎంపీవో తెలిపారు. గ్రామంలో ఎన్నో ఏళ్లుగా గ్రామసభలు నిర్వహించడం లేదని ఫిర్యాదు చేశారన్నారు. పంచాయతీ నిధులు తదితర అంశాలపై విచారణ చేపట్టారు. గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. పంచాయతీ రికార్డులు పరిశీలించామని ఎంపీవో ఆరీఫ్ తెలిపారు. వారితో పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

నేడు రామప్ప రామలింగేశ్వర స్వామి జాతర


కొడుముంజలో ముస్తాబైన రామప్ప రామలింగేశ్వరస్వామి ఆలయం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం కొడుముంజ గ్రామంలోని శ్రీ రామప్ప రామలింగేశ్వర స్వామి ఆలయంలో నేడు శనివారం శ్రీ పార్వతి పరమేశ్వరుల కల్యాణం ఘనంగా నిర్వహించనున్నట్లు సర్పంచ్ కదిరే రాజుకుమార్ తెలిపారు. స్వామివారి కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులు గమనించి పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి దర్శనం చేసుకోవాలన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థిని ప్రతిభ


వైష్ణవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గంభీరావుపేట: ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగిన చిత్రలేఖనం పోటీల్లో జెడ్పీజీహెచ్ఎస్‌కు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని కాలువ వైష్ణవి అత్యంత ప్రతిభ కనబరిచి తృతీయ బహుమతిని సాధించింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వైష్ణవిని శుక్రవారం ఉపాధ్యాయ బృందం అభినందించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల ఎల్లయ్య, ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్ టీచర్ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు



వేములవాడఅర్బన్: వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని విద్యార్థులకు స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు జింక అనిల్, కౌన్సిలర్ సంతోష్‌బాబు, గోడిశెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాల ఆట స్థలానికి భూవిరాళం


ఇంద్రసేనారెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆటస్థలానికి గ్రామానికి చెందిన యాలాల ఇంద్రసేనారెడ్డి భూదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను అభినందిస్తు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొడిశెల నీరజ, ఎంపీటీసీ పూర్మాని కనకలక్ష్మి, హెచ్ఎం లత, ఎస్ఎంసీ చైర్మన్ వేణుగోపాలచారి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓబులాపూర్ పాఠశాలలో మాక్ పోలింగ్


బ్యాలెట్ బాక్సులో ఓట్లు వేస్తున్న విద్యార్థులు

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం బండి ఉపేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించి, ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకమైన అంశమని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు ఎలా జరుగుతాయో విద్యార్థులకు మాక్ పోలింగ్ రూపంలో అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్కౌట్ విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం



ముస్తాబాద్: రాజస్థాన్ రాష్ట్రం రోహత్‌లో జరిగిన 18వ జాతీయ జంబూరిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ముస్తాబాద్ మండలం ఆవునూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. జాతీయ జంబూరీలో పలు విభాగాల్లో ఆవునూర్ పాఠశాల స్కౌట్ విద్యార్థులు పలు అంశాల్లో రాణించారని పీఈటీ తడక సురేశ్ తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు మోడల్స్ అందజేశారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

'ప్రతిష్ఠాపన ఖర్చులన్నీ భరిస్తా'

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ఫిబ్రవరి 8, 9, 10 తేదీల్లో జరిగే గ్రామ దేవతలు కట్ట మైసమ్మ, దుర్గమ్మ దేవతల ప్రతిష్ఠాపన నిర్వహణ ఖర్చులు మొత్తం తానే భరిస్తానని సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. గ్రామపంచాయతీ ఆవరణలో వివిధ కుల సంఘాల సభ్యులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జోగిని శ్యామల పాల్గొంటారని తెలిపారు. కావున కులసంఘాల ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. సమావేశంలో ఉపసర్పంచ్ ఒగ్గు రజిత, వార్డు సభ్యులు, కులసంఘాల ప్రతినిధులు, పాల్గొన్నారు.

'బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం'


మాట్లాడుతున్న ఎర్రం మహేశ్

ఇల్లంతకుంట: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ పాలక్ ఎర్రం మహేశ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ కార్యకర్తలు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిల సమ్మేళనానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 58 బూత్‌లలో బూత్ కమిటీలను బలోపేతం చేసేందుకు శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలను సమన్వయం చేసుకుని వారి బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బెంద్రం తిరుపతిరెడ్డి, జగన్‌రెడ్డి, స్వామి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రసన్న, గంగాధర్, శ్రీనివాస్, కిషోర్, కథ మల్లేశం పాల్గొన్నారు.

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి

వేములవాడఅర్బన్: భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు జిల్లా అధ్యక్షుడు జనపాల వెంకటయ్య అన్నారు. వేములవాడ పట్టణంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభల సాక్షిగా ముఖ్యమంత్రి కేసీఆర్ 15 రోజుల్లో భాషా పండితులకు పదోన్నతులు కల్పిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఐదేళ్లు గడుస్తున్న పదోన్నతులు కల్పించకపోగా ఏదో ఒక అడ్డంకి చూపుతూ దాటావేస్తున్నారని ఆరోపించారు. బోధనలో తాము స్కూల్ అసిస్టెంట్ స్థాయిలో విధులు నిర్వహిస్తున్నందున ఇప్పటికైనా సీఎం కేసీఆర్ పదోన్నతులు కల్పించాలని ఆయన కోరారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి విరాళం


విరాళం అందిస్తున్న శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ లోని జెడ్పీ పాఠశాలలోని టాయిలెట్స్ మరమ్మతుకు పాఠశాలలో చదివిన 2000–01 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థి పెంజర్ల శ్రీనివాస్ శుక్రవారం రూ.20 వేల సాయాన్ని సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డికి అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నాగుల శ్రీధర్, సంజీవ్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా :
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899